క్లుప్తంగా

నేడు మాధవపురంలో గ్రామసభ

రాచర్ల: మండలంలోని మాధవపురం రెవెన్యూ పరిధిలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. భూ రీసర్వేలో ఏమైనా తప్పులుంటే వాటిని రెవెన్యూ గ్రామ సభల్లో అర్జీలు పెట్టుకుంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అటవీ అధికారులు

మార్కాపురం: పెద్దారవీడు మండలం గుండంచర్లలో రేసు కుక్కల దాడిలో రెండు బర్రెలు మృతి చెందిన సంఘటనలో యజమాని కృష్ణారెడ్డికి 35 వేల రూపాయలను బుధవారం అటవీశాఖ కార్యాలయంలో డీఆర్ఓ నాగరాజు అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ వరప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు జి. నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ



ఆధార్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో మస్తాన్‌వలి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎంపీడీవో మాట్లాడుతూ రెండు రోజులపాటు ప్రభుత్వ కళాశాలలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు ఏమైనా ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే సరైన ధ్రువీకరణ పత్రాలతో రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బ్రహ్మయ్య, లెక్చరర్ అల్లూరయ్య పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి రూరల్: పొదిలి ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జె.సుందరరావు తెలిపారు. పొదిలి డిపో పరిధిలో ఉన్న పొదిలి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి మండలాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు 99592 25700 నంబర్‌కు ఫోన్ చేసి పొదిలి డిపో ఆర్టీసీ సర్వీసులు సమయాలు, ట్రిప్పుల గురించి సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో అయ్యప్ప స్వాములు

పొదిలి: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం అధిక సంఖ్యలో భక్తులు దీక్షలు తీసుకున్నారు. కార్తీక మాసం ఆరంభానికి ముందే భక్తులు అధిక సంఖ్యలో దీక్షలోకి వచ్చారని, మాసం ఆరంభమైతే భక్తులు రెట్టింపు సంఖ్యలో దీక్ష తీసుకుంటారని ఆలయ పూజారి మురళీకృష్ణమాచార్యులు చెప్పారు. గురుస్వామి సుబ్బారావు మాలధారణ చేయించారు. పూజారి ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం భక్తులతో పాటు ఇతరులకు కూడా ఆలయ సన్నిధిలో అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో వాసు పూజారి పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న మాధవరావు

గిద్దలూరు రూరల్: వాహనాలు నడిపేవారు రవాణా శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మార్కాపురం మోటారు వాహనాల తనిఖీ అధికారి అల్లం మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డులో కారు స్టాండ్‌లోని డ్రైవర్లకు రవాణా శాఖ నిబంధనలపై అవగాహన కల్పించారు. సొంత వాహనాల యజమానులు తెల్లబోర్డు కలిగి ఉండి బాడుగలకు వాహనాలు పంపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వారి వాహనాలు సీజ్ చేయడంతో పాటుగా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్లు లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తర్లుపాడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బ్రహ్మనాయుడు సూచించారు. బుధవారం తర్లుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు నేరగాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతూ సైబర్ నేరాలు చేస్తున్నారని, హ్యూమన్ రైట్స్ కమిషన్ పేర్లతో మరికొన్ని అనుబంధ సంస్థలమంటూ ఫోన్లు చేసే వ్యక్తుల పట్ల ప్రజలు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేక్ వెబ్‌సైట్లు, ఐడీ కార్డులు, సోషల్‌మీడియా గ్రూపులు సృష్టించి వ్యక్తుల పర్సనల్ డేటా, బ్యాంకు లావాదేవీలను సేకరించి ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని, అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండి తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలను కోరారు.



గుంతలతో అధ్వానంగా ఉన్న ఆటోనగర్ రోడ్డు



సరైన రోడ్డు సౌకర్యం లేని ఆటోనగర్

మా బతుకులు మారేదెన్నడో?

- అభివృద్ధికి ఆమడదూరంలో ఆటోనగర్
- అసాంఘిక కార్యక్రమాలకు నిలయం
- కన్నెత్తి చూడని పోలీసులు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం దరిమడుగు ఇలాఖాలో ఉన్న ఆటోనగర్ సమస్యల వలయంగా మారింది. 2010లో 12 ఎకరాల్లో 100 షాపులు ఏర్పాటు చేశారుగానీ అక్కడ మౌలిక వసతులు కల్పించలేదు. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటోనగర్‌లో సుమారు 100 షాపుల్లో 300 మంది కార్మికులు నిత్యం పనిచేస్తుంటారు. వారికి సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా ఆటోనగర్‌లోని తమ షాపులకు వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుండటంతో చేసేదేమీ లేక షాపులను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని తమ జీవితాల్లో పనులు లేకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. మార్కాపురం-గుంటూరు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఆటోనగర్‌కు వెళ్లాలంటే మట్టి రోడ్డు కూడా సరిగా లేదు. ఆ మార్గం నుంచి వెళ్లాలంటే సర్కస్ చేయాల్సిన దుస్థితి. రాత్రి సమయాల్లో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. విద్యుద్దీపాలు లేకపోవడంతో షాపుల్లో దొంగలు చేతివాటం చూపుతున్నారు బ్యాటరీలు, ఇతర సామాన్లు చోరీ



బురదతో నిండిన ఆటోనగర్

చేస్తున్నారు. 300 మంది కార్మికులు పనిచేస్తున్న చోట తాగేందుకు కనీసం నీటి సౌకర్యం, బాత్‌రూమ్స్ కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఆటోనగర్ గౌరవ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 4 లక్షల రూపాయలతో మట్టి రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి:



దరిమడుగు సమీపంలో ఉన్న ఆటోనగర్‌లో నిత్యం 300 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఆటోనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తాగునీరు, విద్యుద్దీపాలు, టాయిలెట్స్, వెయిటింగ్ హాల్ నిర్మించాలి.

– గుంటక సుబ్బారెడ్డి, ఆటోనగర్ గౌరవ అధ్యక్షుడు

పన్నులు చెల్లిస్తున్నాం:



ఆటోనగర్‌లో నిర్వహిస్తున్న షాపు యజమానులు పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. అధికారులు స్పందించి వెంటనే మౌలిక వసతులు కల్పించాలి.

– ఎస్.భద్రి, కోశాధికారి

విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి:



ఆటోనగర్‌లో రాత్రి సమయాల్లో విద్యుద్దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో షాపుల్లోకి విషపూరితమైన పాములు, పురుగులు వస్తున్నాయి. అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

– కుప్పుస్వామి, వెల్డర్

రాత్రి వేళ పోలీసుల నిఘా పెంచాలి:



ఆటోనగర్‌లో రాత్రి సమయాల్లో విద్యుద్దీపాలు లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి నిఘా పెట్టి దొంగతనాలు అరికట్టాలి.

– ఎంఆర్‌కే బాషా, ఆటోనగర్ అధ్యక్షుడు

రెక్కాడితేగానీ డొక్కాడదు:



వర్షం పడిందంటే ఆటోనగర్‌లోని షెడ్లకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకుల్లో వర్షం కురవడం ఇబ్బందిగా మారింది. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో వచ్చే నాథుడే కరువయ్యాడు.

– షేక్ అబ్దుల్లా, కార్ మెకానిక్

మంచినీరు, మరుగుదొడ్లు నిర్మించాలి:



ఆటోనగర్‌కు వచ్చే కార్మికులకు, రిపేర్ల కోసం వచ్చే యజమానులకు, డ్రైవర్లకు తాగేందుకు కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. మరుగుదొడ్ల వసతి కూడా లేదు. అధికారులు ఆటోనగర్‌లో మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించాలి.

– షేక్ నాసర్‌వలి, మెకానిక్

వాడీవేడిగా కొనకనమిట్ల సర్వసభ్య సమావేశం

- సర్పంచ్‌ల తీర్మానం లేకుండా వర్క్‌లు ఎలా చేస్తారు
- గార్లదిన్నెలో మరణించిన వారికి మొక్కలు మంజూరు
- అధికారుల పనితీరుపై సభ్యుల అసంతృప్తి



అనర్హులకు పనులు మంజూరు చేయడంపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం వాడీవేడిగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాలలో చేపట్టే పలు పనులకు సంబంధించి సర్పంచ్‌ల తీర్మానం లేకుండా ఎమ్మెల్యే చెప్పాడని మీరు ఎలా పనులు మంజూరు చేస్తారని అధికారులను వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీల సభ్యులను పిలవకుండా గ్రామస్థాయి టీడీపీ నాయకులను పిలవడంపై తమను అగౌర పరిచినట్టేనని సభ్యులు ధ్వజమెత్తారు. సమావేశం మొదటగా ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన ఎంపీడీఓ ఈశ్వరమ్మ నిర్వహించారు. పలువురు అధికారులు తమ శాఖకు సంబంధించి మాట్లాడుతుండగా ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు, పలువురు సభ్యులు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 73వ రాజ్యాంగం సవరణ ద్వారా పింఛన్లు పంపిణీ అంశం మండల పరిషత్‌కు అప్పజెప్పారని, అలా కాకుండా పింఛన్ల పంపిణీలో ఎటువంటి పదవులు లేని టీడీపీ నాయకులు చేత పంపిణీ చేయించడాన్ని వారు తప్పుబట్టారు. గత సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశామని, వాటి గురించి చెప్పాలని ఎంపీడీఓను కోరారు. గత ప్రభుత్వంలో గ్రామ సచివాయాలు ప్రారంభించినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల ఫొటోలతో శిలాఫలకాలు వేస్తే అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు వాటిని తొలగించేపనిగా పెట్టుకున్నారని, మరి ఇప్పుడు టీడీపీ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండానే సీసీరోడ్లు వేస్తామని ముందుగానే ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల ఫొటోలతో శిలాఫలకాలు ఎలా ఏర్పాటు చేస్తున్నారని సభ్యులు ప్రశ్నించారు. గార్లదిన్నె పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో పలు రకాల పండ్ల మొక్కలు నాటేందుకు అర్హులైన వారికి సర్పంచ్ తీర్మానం ఇవ్వగా గ్రామ టీడీపీ నాయకులు వారి వర్గం వారికే పండ్ల మొక్కలు పెంచేందుకు మంజూరు చేయించుకోవటంపై స్థానిక నాయకులు సభ దృష్టికి తెచ్చారు. గ్రామస్థాయిలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచ్ తీర్మానం కీలకమని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి అన్నారు. మండలంలో విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించిన ఎంఈఓ-1 దాంగే షరీఫ్ పనితీరును తప్పుపడుతూ జిల్లా విద్యాశాఖకు సరెండర్ చేయాలని సభ్యులు తీర్మానం చేశారు. 1100 ఎకరాలకు సాగు నీరు అందించే వద్దిమడుగు చెరువును అభివృద్ధి చేయాలని సర్పంచ్ పిచ్చయ్య సభదృష్టికి తెచ్చారు.




మొలకలు వచ్చిన సజ్జ పంటతో రైతులు



నీరు ఎక్కువై మిరప పంట ఇలా..

రైతు కష్టం వర్షార్పణం

బేస్తవారిపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఎడతెరపి లేకుండా వారం రోజులుగా కురిసిన వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఖరీఫ్‌లో సాగు చేసిన మిరప, మినుము, పత్తి, పొగాకు, సజ్జ, జొన్న తదితర పంటలు అధిక వర్షాలకు దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. బేస్తవారిపేట మండలంలోని గలిజేరుగుళ్ల పంచాయతీ పరిధిలో ఎక్కువగా సజ్జ పంట సాగు చేశారు. మరో వారం రోజుల్లో కోత కోయాల్సిన పంట ఏకధాటిగా పడిన వర్షాలకు దెబ్బతింది. 125 హెక్టార్లలో సజ్జ పంటలో కంకులు కుళ్లిపోవడం, మొలకలు రావడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.



కుళ్లుతున్న పొగాకు పంట

9వ రోజు కాంట్రాక్టు కార్మికుల నిరసన దీక్ష

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ కార్యాలయంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు కె.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు నిర్వహిస్తున్న నిరసన దీక్ష బుధవారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో దాదాపు 20 నుంచి 25 ఏళ్ల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ఉపాధి కోల్పోయిన కార్మికులు ఇన్నేళ్లుగా ఈ వృత్తినే నమ్ముకుని వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, అక్రమంగా తొలగించడంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చిరుద్యోగులపై తమ ప్రతాపం మానుకొని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా కూటమి ప్రభుత్వం తమను అక్రమంగా తొలగించి తమ ఉపాధిని కోల్పోయేలా చేసిందని మండిపడ్డారు. జి. హరి, శ్రీను, కనకయ్య, షబ్బీర్, సుబ్బారెడ్డి, ఇమాంసా, సుబ్బయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.



నిరసన దీక్షను ప్రారంభిస్తున్న సుబ్బరాయుడు

ఆకుమచ్చ తెగులు సకాలంలో నివారించుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

రాచర్ల: పత్తిలోని ఆకుమచ్చ తెగులును గమనించి సకాలంలో నివారించుకుంటే అధిక దిగుబడులు సాధించుకోవచ్చని గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని సత్యవోలు, అనుములపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ప్రస్తుతం పత్తి పంటలో ఆకు మచ్చ తెగులు ఉందని రైతులకు వివరించారు. వాటి నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లేదా కార్బన్డిజం ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పంటలపై పిచికారి చేసుకోవాలన్నారు. అనంతరం పత్తి, కంది పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి విష్ణుప్రియ, వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్, వ్యవసాయ విస్తరణాధికారి బి.సంపత్‌కుమార్, అనుములపల్లె సర్పంచ్ సిరిగిరి రమేష్, అనుములపల్లె రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణ, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

కంభం: మండలంలోని చిన్ననల్లకాల్వ, పోరుమామిళ్లపల్లి గ్రామాల్లో బుధవారం పంట పొలాలను వ్యవసాయాధికారిణి డి.స్వరూప పరిశీలించారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు పొగాకు, పత్తి, కంది పంటలకు కలిగిన ఇబ్బందులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పప్పు ధాన్యం పంటల్లో నీరు నిల్వ ఉండటం వలన ఇనుప ధాతు లోపంతో మొక్క ఎర్రబడుతోందని, దాని నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రా, 0.5 యంజి సిట్రిక్ యాసిడ్ 20 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

ఊరకెత్తిన మిరపకు యూరియాతో ఊపిరి

బేస్తవారిపేట: ఊరకెత్తిన మిరప పంటలో మొక్కలు తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ, ఉద్యానవనశాఖ అధికారిణి డీ శ్వేత అన్నారు. మండలంలోని ఖాజీపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మొక్కలు పూర్తిగా తలలు వాల్చినప్పుడు మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలన్నారు. కందిలో అంతరకృషి చేయడంతో కలుపును నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ ఎం.బాలకృష్ణ పాల్గొన్నారు.



పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ



మిరపలో సూచనలు ఇస్తున్న ఏఓ, హెచ్ఓలు

అవసరం లేకున్నా నీరు సరఫరా

- అధికార పార్టీ నాయకుల కోసమే ట్యాంకర్లు



వాటర్ ట్యాంకర్

తర్లుపాడు: మండలంలోని గానుగపెంట పంచాయతీలో తాగునీరు పుష్కలంగా ఉన్నా కూటమి తమ్ముళ్ల కోసం అధికారులు ట్యాంకర్లను తిప్పడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో అప్పట్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 11 ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు నీరు సరఫరా చేశారు. ఇంత వరకూ బాగానే ఉంది. జూలై నుంచి వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగి డీప్‌బోర్లలో నీరు రాడవంతో పాటు సాగర్ పైపులైన్ల ద్వారా కూడా గ్రామ ప్రజలకు నీరు అందిస్తున్నారు. అయినా అధికార పార్టీ నాయకుల కోసం, వారి ఆదాయాన్ని పెంచేందుకు 11 టాంకర్లు తిప్పడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఈ నీళ్లు ఎవరికి, ఎప్పుడు, ఎక్కడ అందిస్తున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పునరాలోచించాలని, ప్రభుత్వ సొమ్మును వృథా చేయరాదని, నిజంగా నీటి ఎద్దడి ఉంటే తాము కూడా స్వాగతిస్తామని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

మార్కాపురం విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు



నిహాల్ (ఫైల్)

మార్కాపురం: పట్టణానికి చెందిన విద్యార్థి ఎస్‌కే మహ్మద్ నిహాల్ ఎన్‌సీసీ కోటాలో విజయనగరం ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించినట్లు జ్ఞానశ్రీ నీట్ అకాడమీ డైరెక్టర్ ఎం. మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా నిహాల్‌ను పలువురు అభినందించారు.

ఉపాధి పనులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న హరికృష్ణ

పొదిలి రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై అవగాహన కలిగి ఉండాలని దర్శి సీడీసీఎల్ఆర్‌సీ హరికృష్ణ అన్నారు. బుధవారం పొదిలి, మర్రిపూడి మండలాలకు చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్లు, సీనియర్ మేట్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఎఫ్ఏలు, సీనియర్ మేట్లు మస్టర్ నిర్వాహణ, ఎన్ఎంఎంఎం మస్టర్ పంపించే విధానం, పనికి సంబంధించిన కొలతలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో పనికి వచ్చే ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.



రాచర్ల బస్‌స్టాండ్ సెంటర్‌లో నేల వైపు చూస్తున్న సీసీ కెమెరా



బ్యాంకుకు వెళ్లే దారిలో ఆకాశం వైపు చూస్తున్న సీసీ కెమెరా

నిఘా..నేల వైపు

- పట్టించుకోని పోలీసులు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు కీలకమైన నేరాల ఛేదనలోనూ సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయి. అటువంటి వాటిని పోలీసులు అటకెక్కించడంపై ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణను పోలీసులు గాలికొదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో శాంతి భద్రతలు లోపిస్తున్నాయి. ఇటీవల మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలో పలు దేవాలయాల్లో వరుసగా హుండీ దొంగతనాలు చేస్తూ దొంగలు చెలరేగిపోతున్నారు. దొంగ రవాణా చేసుకునేవారు గిద్దలూరు టు వయా బేస్తవారిపేట, కంభం బైపాస్ రోడ్డుపై వెళ్లేందుకు టోల్‌గేట్ ఉండటంతో కంభం టు రాచర్ల మీదుగా గిద్దలూరు వైపునకు వెళ్లిపోతున్నారు. రాత్రి సమయాల్లో రేషన్ బియ్యం లోడుతో వాహనాలు వెళ్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సీసీ కెమెరాల మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పిచ్చిరెడ్డి తోటలో ఇల్లు దగ్ధం

పొదిలి: స్థానిక పిచ్చిరెడ్డి తోటలో నివాస గృహం దగ్ధమైంది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. బల్లగిరి రమణమ్మ ఆమె కుమారుడు మధు గృహంలో నివాసం ఉంటున్నారు. మధుకు ఇటీవలే వివాహం జరిగింది. దసరా పండగకు కుటుంబ సభ్యులు ఒంగోలు వెళ్లారు. గృహం దగ్ధమైన సమాచారం స్థానికులు చెప్పటంతో వారు ఒంగోలు నుంచి వచ్చారు. ఇల్లు, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయినట్లు మధు చెప్పారు. నగదు రూ.50 వేలు, ఆరు సవర్ల బంగారు నగలు కనిపించటం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. చోరీ చేసేందుకు వచ్చిన వారు కిటికీ అద్దాలు కూడా పగులగొట్టారని, ఇంటి ఆవరణలో రక్తపు మరకలు కూడా ఉన్నాయని ఆయన భయాందోళన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మధు చెప్పాడు.



దగ్ధమైన ఇల్లు

రోడ్డు ప్రమాదంలో గేదెకు గాయాలు

- వైద్య సేవలు స్వయంగా పర్యవేక్షించిన జేడీ



సంఘటన స్థలంలో జేడీ బేబీరాణి

పొదిలి: పొదిలి-మార్కాపురం రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె గాయపడిన సంఘటన బుధవారం కొనకనమిట్ల సమీపంలో జరిగింది. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ బేబిరాణి గాయపడిన గేదెను పరీక్షించారు. 1962 సంచార పశువైద్య వాహనానికి, పశు వైద్యులకు సమాచారం ఇవ్వటంతో వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని వైద్య సేవలందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పొదిలి ప్రాంతీయ పశువైద్యశాలకు గేదెను తరలించారు. అక్కడ డాక్టర్ వేణు వైద్య సేవలు అందిస్తున్నారు. రోడ్డుపై గేదెలు రాకపోకలు సాగించే సమయంలో యజమానులు అప్రమత్తంగా ఉండి అవి రోడ్డు దాటేంత వరకు చూసుకోవాలని జేడీ బేబీరాణి చెప్పారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న సీఐ, ఎస్సైలు



వ్యాసరచన పోటీని పర్యవేక్షిస్తున్న సీఐ

మార్కాపురం: రక్తదానం చేసి ప్రాణదాతలుగా ఉండాలని మార్కాపురం సీఐ సుబ్బారావు సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, పలువురు ఆటోడ్రైవర్లు, యువకులు రక్తదానం చేశారు. సీఐ మాట్లాడుతూ పోలీసు అమవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏటా రక్తదాన శిబిరం నిర్వహించి ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులకు అందజేస్తామని చెప్పారు. గర్భిణులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ రక్తం ఉపయోగపడుతుందన్నారు. ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, పీఎస్ఐ రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో 82 మంది రక్తదానం చేశారని సీఐ సుబ్బారావు తెలిపారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు రక్తదానంలో పాల్గొన్నట్లు కిట్స్ కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య తెలిపారు.

గిద్దలూరు రూరల్: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక సీఐ కె.సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బహుమతులు 27 వ తేదీ అందజేస్తారని సీఐ తెలిపారు.